# శ్రీమతి చిందులాటలు +

రచన :
శ్రీ. ఏ. యస్. రామారావు.

ఏమండోయ్!

మిమ్మల్నేనండీ! పలకరేమండీ?

అబ్బబ్బ! లేపలేక చస్తున్నాను.

అంత మొద్దునిద్దరేమిటండీ ఎనిమిదవొస్తుంటేనూ?

ఆదేంపనండీ? లేవండీ. పండగ పూటయినా కాస్త తొందరగా లేవరేమండీ?

కప్పులో కాఫీ చల్లారిపోతోంది. పొయ్యిమీద నీళ్లు మరిగి పోతున్నాయి.

అయ్యోరాత! గుడ్లప్పగించి చూస్తూనే పలకరేమండీ?

కాస్త అలాబజారుకి పోయొద్దామని లేదేవిఁటి?

పండుగ పూట పాడి మెతుకులు గతుకుదా మనుకుంటున్నారేటి?

ఈమాత్రానికి, తగుదునమ్మా అంటూ ముద్దుల చెల్లాయిని, బావగార్ని పండక్కి పిలంవట మెందుకూ?

అయ్యో! ఇదేం ఖర్మమండీ? బండికి టైం అయితుంటేనూ?

పాపం వాళ్లీవూరికి క్రొత్తయె. స్టేషన్కు వెళ్లక్కర్లేదుటండీ?

ఇంతబద్ధకస్తులయితే, పోనీ నిన్నఆఫీసు నుంచి వచ్చేటప్పుడు ఈ మాట కాస్త మీరామదాసు చెవిని పడెయ్యలేక పోయేరూ?

ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ప్రయత్నించిందట!

కట్టుకున్న దానికళ్లల్లోనీళ్లు తెప్పిస్తూ కన్నవారికి హారతులు పడదామనేనా?

అయినా మీకేంపోయిది? ఆ అనేవాళ్లు నన్నంటారుగాని.

మనం ఎలావున్న, తిన్నా ఫరవాలేదు. ఆ వచ్చేవాళ్లనైనా సరిగా చూడకపోతే ఎలా?

పప్పులోకి నెయ్యి లేదండీ!

పులుసులో ముక్కలుకావాలని భోజనందగ్గర పట్టుబడితే ఎలా?

అనుకుంటూనే వున్నా ఇవాళ ఏదో రభస జరుగుతుందని.

మిమల్నని ఏంలాభం?

ఆరోజే అనుకున్నా, ఏరోజో ఏడిపించుకుతింటారని.

పండక్కి చీరకొనమన్నాననేగా ఇలాఏడిపించుకుతినటం?

కొంటాను కొంటానని మురిపించి చివరికి మసి పూసి మారడికాయచేసేరు.

చీరకొనలేనని ముందే చెప్పేస్తే సరిపోయేదిగా!

చీదరించుకొన్నానని ఆ పలుకెందుకు?

పుస్తెకట్టించుకున్నదాన్ని, ఆమాత్రం చీరకొనమని అడగటానికికూడా హక్కులేదుటండీ?

పండగ పూటా క్రొత్త చీరకట్టుకోటానికూడా నోచుకోలేదుటండీ?

ఏమిటో! చీరకోసమా ఏవిఁటి? మీ ఆనందకోసంగాని.

మీ ఆనందం కంటే నాకేంగావాలి చెప్పండీ?

మామూలురోజుల్లోనే చీర ఏమాత్రం మాసిన చిరబురలాడే వారు!

అందుకనే అడిగాను!

అడిగితే తప్పా?

కొనకపోతే మానె. కోప మెందుకూ?

అమధ్యమీరు ట్వీడు సూటు కుట్టించుకుంటే నేనేమన్నా అన్నానా? అడిగానా?

ఒక వేళ అడిగినా చెంప చెడేలుమనేది అంతేగా.

అందుకనే అడగనూలేదు. అడగదల్చుకోనూ లేదు.

ఆరోజె-పెళ్లి చూపుల నాడు నన్నుచూసి ముసిముసిగా నవ్వితే ఏమేమో అనుకున్నాను. ఎంతగానో మురిసి పోయేను.

మీనవ్వు వెనక ఇంత అవాజ్యమైన ప్రేమ దాక్కుని వుందని నాకానాడే తెలిస్తే బ్రతికి పోయేదాన్ని.

ఏమిటో నాపిచ్చిగాని, ఎంతయినా మొగాళ్లు కదా!

మీ మగతన మంతా నామీదనుటండీ?

పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేసినట్టు!

అయినా, అంటే మీకు కోపంగాని, నిజంగా ఆ ట్వీడుసూటు మీరు కుట్టించుకున్న దేనా అని?

గొప్పకోసం అందరితో కోసేస్తూన్నారు కాని, నిజం ఎవరికైనా తెలిస్తే మీకెలావుంటుంది?

పెద్దపండక్కి మాబాబాయి నాకు పసుపుకుంకంతో కలిపి ఇచ్చిన కట్నం కాదుటండీ?

ఈ పండక్కి బెనారసు చీరకొంటానని' నన్ను లాలించి, నమ్మించి తీసుకున్న దేనా?

మీరు కుట్టించుకున్న సూటు నా డబ్బు పెట్టి కొన్న దేనా?

'నీ' 'నా' అన్న భేదాలు మొగాళ్ళకే కాని ఆడ వాళ్ళ కసలక్కర్లేదు.

మీ రనుభవిస్తూంటే నే ననుభవిస్తున్నట్టు కాదూ?

మొగాళ్లనుభవించడానికేగా – ఆడవాళ్లవతరించింది?

అందుకనే అడగ్గానే అర్పించేసేను బాబుయి ఇచ్చిందంతా.

మొదట్లోనే నివ్వనంటే మీ మొహం ఎలా జేవురించింది? మీ మనస్సెంత బాధపడింది?

మీ బాధను చూళ్ళేక పోయేను. అనవసరంగా అన్నందుకు మధన పడ్డాను.

ఆడవాళ్ళ హృదయం ఎలాంటిదో మగాళ్ళకేం తెల్సు?

ఎంత సున్నితమైంది; నిజంగా నవనీతం లాంటిది!

ఎదుటివాళ్లు బాధపడుతూంటే సహించలేదు స్త్రీ హృదయం.

అందుకే ఆడదానికి మాతృత్వాన్ని ప్రసాదించాడు భగవంతుడు?

మొగాళ్లకే ఈ డ్యూటీనిస్తే, ఈ సరికి సృష్టి ఈ క్షితిలో నుండేదా? ఓ యబ్బో! ఎంత మిడిసిపాటు?

చెవిటివాడి చెవిలో శంఖం పూదినట్లు కాకపోతే, ఏమిటినా ఈ సొదంతా?

ఒక్కమాటయినా మీ చెవికెక్కిందా?

మీలాంటి అపేక్ష నాకు మాత్రం వుండదూ?

పండగపూట క్రొత్త చీరకట్టుకోవాలనిపించదూ?

అడిగితే డబ్బెక్కడుందంటారు?

పిల్లా పిచికా ఏంలేరు మనకు. మనమీద ఆదారపడే వాళ్లంతకన్నా లేరు.

'ఛల్ మోహనరంగా' అంటూ ఈ పడవ ఇలాసాగి పోవల్సిందే!

'పోనీ, పుట్టబోయేవాళ్లెవరికైనా నిలవ చేస్తున్నారా' అంటే అదీ లేదు.

'ఏమవుతోంది డబ్బంతా?' అని అడగటానికైనా హక్కులేదు కదా!

అడిగేదిక్కు అసలే లేదు.

ఎవరికో మ్రొక్కుబడి కాకపోతే గడించిందంతా ఏమవుతున్నట్టు?

ఏం? అలా చూస్తున్నారేం? కళ్లెందుకెర్రచేస్తున్నారు?

వున్నమాటంటే ఉలుకెక్కువట!

శ్రీ వారికికోపం వస్తోందెందుకో?

కోపంవస్తే రెండు వాయిస్తారు. అంతేకదా మీరు చెయగలిగింది?

నాకళ్ళంట పచ్చినీళ్ళు మీరాతిగుండెమీద దుమ్ము కడిగాక నైనా మీ గుండె తేలికపడుతుంది. అప్పుడైనా మనసు మారుతుంది.

ఆడదాన్ని అలుసులా చూడ్డం అంతమంచిదికాదండీ! ఎందుకలా పరిహాసం చేస్తారు?

ఇంకా తెలియదేమిటి రోజులు మారాయని? మగాళ్ళతో సమానంగా ఆడవాళ్ళకీ హక్కులున్నాయని?

ఆడవాళ్లు తమ హక్కుల్ని వినియోగించుకోటానికి సిద్ధపడితే మగాళ్ళ పస తెల్సుందేది!

నవ్వండి! బాగా నవ్వండి!

'నవ్వు నాలుగువిధాల చేటు' అన్నారు పెద్దలు.

'సిగ్గులేని మొహానికి నవ్వే సింగారం' అన్నారు వెనక ఎవరోఒకాయన.

అంత అతిగా నవ్వితే నవరత్నాలు రాలతాయనుకుంటున్నారా?

అదృష్టం అంటూవుండాలి. ఆ భాగ్యం అందరికీ అబ్బుతుందటండీ?

ఆనాడు అంత చిన్నగా నవ్వి ఇలా ఆడిస్తున్నారు; ఈ నాడు ఇంత 'యిది' గా నవ్వుతూ ఎలా ఆడిస్తారో?

ఆనాటిదాన్నే ననుకుంటున్నారా ప్రియా! ఇంకా మనసులో?

నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా!

ఇంక లాంగేది లేదు. ఇవాళ ఆటో, ఇటో తేలిపోవాల్సిందే.

నాకేమంతగతి కడుక్కుపోలేదు. నన్ను పోషించటానికి మీకేం దిగులక్కర్లేదు.

మునుగు తన్నేరేమండీ?

నా మాటలు వింటుంటే మనసు నొప్పెడుతోందా? లేక నాముఖం చూట్టానికి మీ మొహం చెల్లటంలేదా?

మన బ్రతుకెప్పుడూ ఇలా పోట్లాటలతో తెల్లారిపోవాల్సిందే.

మీరు నాకు చీరతేనూ అక్కర్లేదు, నేను కట్టుకోనూ అక్కర్లేదు.

పోనీ, మీ చిన్నారి చిట్టి చెల్లాయి వస్తోంది. రాక, రాక ఎన్నాళ్లకో, ఎంత ఆశగా వస్తోందో? ఆవిడకంటె మనకొకావల్సిన వాళ్ళెవరండీ?

మీకేం పోయింది. మీ రూరుకుంటారు. ఆ వచ్చిన వాళ్లని మర్యాద చెయ్యకపోతే నన్నంటారు కాని.

అన్నయ్యకుండే అభిమానం ఒదినమ్మ కెక్కడుంటుందని.

అప్పుడే మరిచారుటండీ? ఆరోజు మనల్ని వాళ్లెంతగా ఆదరించారో?

ఎప్పుడూ మీది 'వన్ సైడ్ ట్రాఫిక్కే' కదా!

కట్టుకున్న పెళ్ళాంమీద కరుణలేకపోయినా, రక్తాన్ని పంచుక పుట్టిన తోబుట్టువుమీద ఆమాత్రం అభిమానం లేదుటండీ?

తెలీక అడుగుతాను కాని, నేనేం చేసేనని? నా మాటల్ని అంత నిర్లక్ష్యం చేస్తారెందుకూ?

ఇవాళ పండగని నిన్ననే ఆఫీసుకెళ్తున్నప్పుడు చెప్పానా? రాకరాక వస్తున్న మరదలుపిల్లకి నాజూకైన చీర తీసుకురమ్మన్నానా?

నాదగ్గర గంగిరెద్దులా తల ఆడించి ఏం తీసుకువచ్చేరు?

అర్ధరాత్రయినా ఇంటి ముఖం చూళ్ళేదు.

పిల్లిలా ఎప్పుడొచ్చారో ఏమో! ఎందుకింత ఆలస్యం అయిందని అడగటాని కసలే వీల్లేదుకదా!

వచ్చినవాళ్ళు వచ్చినట్లే పడుకోవాలా?

మీకుమీరే వడ్డించుకు తినకపోతే కాస్త లేపరాదూ?

అబ్బబ్బ! మీకు మేలుకొలుపులు పాడుతూ కూర్చుంటే అవతల ఆ పనులన్నీ ఎవరు చేస్తారనుకున్నారు?

మీకంటే ఏం అక్కర్లేదు కాని, నేను చూస్తూ వూరుకోలేను సుమండీ!

ఉఁహూఁ! ఏమిటండీ ఉఁహూఁ! లెమ్మంటూంటే.

'అప్పుడే తెల్లారిందా' అని అడుగుతారేమండీ నడినెత్తికి ప్రొద్దెక్కితో వుంటే!

అమ్మాయి వస్తోందా అని నన్నా అడగటం? అబ్బ! ఎంత నంగనాచితనం? ఉత్తరం మీకే కదూ వస్తే! మీరేకదూ నాతో చెప్పింది?

'చీరా, పంచల చాపులు కొనాలా' అని నన్నా అడగటం?

మిన్నువిరిగి మీదపడ్డ తరవాత.

బాగుంది వరస. రెడ్డొచ్చె-మొదలెట్టు అన్నట్టుంది.

రామాయణం అంతా విని రాముడికి సీత ఏమవుతుందనడిగినట్లుంది.

నామాట ఎలావున్నా మీ చెల్లికి, బావకి బట్టలు కొనాల్సిందేగా. ఆపైన మీకు కావలిస్తే మీరూ కొనుక్కోండి. వద్దనటానికి నేనెవర్తెను మధ్య.

అక్కడికి మహా నేను చెప్పినట్టు నడుస్తూన్నట్టూ! నాముద్దూ, ముచ్చటా తీరుస్తూన్నట్టూ!

ఎంతయినా మీరూ, మీరూ ఒకటేగా. ఇక్కడ నేనేగా పరాయిదాన్ని.

ఆడించండి. ఎంతగా ఎన్నెన్నన్నాలో అన్నీ అనండి. అదేగా మీకు సరదా?

ఆడదాన్ని అంతగా ఏడిపిస్తే మీకే తెలిసొస్తుంది ఆ తరవాత.

అదేమిటండీ! మంచంక్రింద చూస్తున్నారేమిటి? అక్కడ ఏముంటుందని?

అదేమిటి? ఆ మూటేమిటి?

అరెరె! ఇవన్నీ ఎప్పుడు తెచ్చేరండీ? ఈమాత్రానికి ఇంతరహస్యం దేనికండీ?

చెబితే అరిగిపోతారా? తరిగిపోతారా?

అయ్యో రామ! నాకు ముందుగా చెబితే ఏం కొంప మునిగిపోతుంది?

నాకెంతకష్టం కలిగించారు? ఎన్నెన్ని మాటలనిపించారు?

ఎంతయినా మీ మగతనం పోనిచ్చుకున్నారు కాదు. అయినా, నాకోసం ఇంత బజారు చేసుకువచ్చేరంటే నేను నమ్మను.

ఏవిఁటీ? ఇచ్చిన వాగ్దానాన్ని త్రోసివుచ్చటం మీ జన్మలో లేదూ?

ఎలా అయితేనేం పుట్టారు అపర హరిశ్చంద్రులు! ఏవిఁటో అంత ఘోరమైన వాగ్దానం?

పెళ్ళివాడు చేసిన ప్రమాణమా?

ఏవిఁటో అంత ఘనమైనదీ, కాదనరానిదీనూ?

ఓయబ్బో! మరీ బాగుంది మీవరస! అయితే ఇంకేం? కొంగుపట్టుకు తిరగండి.

అలాగే నంటారా? మహా బాగుంది.

అయ్యోయ్యో! అదేవిఁటి మరీ చిన్నవాళ్ళయి పోతున్నారు!

అబ్బబ్బ! వదలండీ. పట్టపగలు ఇదేవిఁటి మరీ ఇదై పోతున్నారు! ఎవరైనా చూస్తారనైనా లేదూ?

చాలు మీ సరసం కాని, లేవండి. త్వరగా తెమిలి స్టేషనుకు వెళ్ళండి. టైం కూడా అవ్వొస్తూంది.

ఏవిఁటీ? పండక్కి కట్నమా? నేనా? మీకా? ఇవ్వటమా? బాగుంది, బాగుంది! ఎవరైనా వింటే నవ్వి పోతారు. సంపాయించేవాళ్ళు మీకు నేనా కట్నం ఇవ్వాల్సింది?

ఓ! అదా! ఇప్పుడేవిఁటీ? వేళా పాళా వుండక్కర్లా?

అయితే లేవరూ? భాగుంది; మరీ బాగుంది మీవరస! సరే!

ఆఁ! ఆఁ! అబ్బ! చాల్లెద్దురూ!

ఊఁహూఁ! పోనిద్దురూ!

ఊఁ! సరేనా! తీరిందా మీ సరదా?

హమ్మయ్య! తెల్లవారింది! ఎలా అయితేనేం పండగ వచ్చింది!


# కుటుంబ నియంత్రణం
## గర్భనిరోధానికి

స్త్రీలు సేవింపదగిన ఔషధము స్పెక్ టేబ్ లెట్స్ (రిజష్టర్డ్)
గర్భము రాకుండేందుకు తేలికగా నోటిలో వేసుకొని మింగే మందు

12 రోజులు మందు వాడిన యెడల గర్భధారణ కాకుండా చేయును.

ప్రతికోర్సు ప్యాకెట్టు 24 మాత్రలు వెల రు 12/- వి.పి. చార్జి అదనం




ఇండియాలోను, విదేశాలలోను ఈమందు వాడినవారు అయాచితంగా అనేక యోగ్యతా పత్రములను పంపియున్నారు

ప్రతిచోట దొరుకును

SEENU & CO., 29.K. TANDAVARAYA GRAMANI ST. MADRAS-21.
GRAMS: "ORCAS" (ESTD 1946) PHONE 55357.
BRANCH: SINGAPORE-8 (CEYLON) AGENTS: N.C.M. STORES 82, MAIN ST. COLOMBO-11.
(ADVT. PERMITTED UNDER G.O.MS. NO 1121. HEALTH.)